# 10
# పాతివ్రత్యం

అమ్మకి నిజంగా పెద్ద బొట్టు పెట్టుకోవాలనీ, ఎంతో యిష్టమైన మల్లె మాలలు తలలో తురుముకోవాలనీ వుండదా?... తప్పకుండా వుండే వుంటుంది. అయితే చెప్పదు. చెపితే ఈ సమాజం చీరేస్తుంది...

మోహన్‌ప్రసాద్

"అబ్బబ్బ," చేతిలోని పుస్తకాన్ని విసిరి కొట్టాను.

వచ్చింది మొదలూ ఒకటే పోరు... ఇందుకే రావాలంటే విసుగు.

రాకపోతే అక్షింతలు... వస్తేనేమో యిదీ గొడవ.

"ఏంట్రా మాట్లాడవే?" రెట్టించింది అమ్మ.

"ఏంటమ్మా?" విసుగు దాచాలన్న నా ప్రయత్నం ఫలించినట్లులేదు. వాడెవడికో ఒంట్లో బాగుండదు... కోన్‌కిస్కా గొట్టంగాడికి... నేనెళ్ళి చూడాలి... నేను చూడ్డం కన్నా హాజరు వేయించుకోవడం ముఖ్యం.

నాకీ విచారింపులూ, పలకరింపులూ, లేని దిగుళ్ళు నటించడాలూ, దిగులులేని వాళ్ళని ఏడిపించడాలూ, తగుదునమ్మా అంటూ వెళ్ళి కాస్త మర్చిపోతున్న వాళ్ళని గుర్తు చేసి మరీ గుచ్చడాలూ యివన్నీ చిరాకు.

వీటన్నింటికీ నే ను అతీతుడ్ని ... ఫ్రీబర్డ్‌ని.

ఈ బంధాలు, ప్రేమలు, కట్టుబాట్లూ, ఆచారాలూ అంతా వట్టి ట్రాష్... అసలెవరేర్పరిచారివన్నీ.

ఈ మనిషినే వాడు బుద్ధిలేన్నాకొడుకు.

ఇవన్నీ ఏర్పాటు చేసుకుందీ తనే... ఈ బంధాలన్నీ ఏర్పరిచిన వాడ్ని దుయ్యబట్టేదీ తనే...

నాకొద్దబ్బా యియ్యన్నీ నాకొద్దనే వొద్దు.

"చిన్నా... నామాట విన్రా" బతిమాల్తోంది అమ్మ చేట్లోని బియ్యంలో రాళ్ళేరుతూ. మధ్యమధ్యలో వచ్చిన వడ్లగింజల్ని వృధాపరచకుండా నోట్లో వేసుకుంటోంది. .జీవితంలోని కష్టాలనీ, కన్నీళ్ళనీ కూడ అమ్మ యిలాగే కడుపులో వేసుకుని మింగేసింది.

ఒకసారి అమ్మ కేసి నిశితంగా చూశాను.

బొట్టులేక బోసిపోయి వున్న అమ్మ ముఖం...

గుంటలు పడ్డ కళ్ళ కింద నల్లటి చారలు...

సాదా గోధుమరంగు చీరకి సన్నటి కాఫీకలరు బోర్డరూ మట్టిగాజుల్లేని చేతులూ... ఛీ...ఛీ అసలెవరు చెప్పారు మొగుడులేని ఆడవాళ్ళు యింత దీనంగా బతకాలని?

అమ్మకి నిజంగా పెద్ద బొట్టు పెట్టుకోవాలనీ, ఎంతో యిష్టమైన మల్లెమాలలు తలలో తురుముకోవాలనీ వుండదా?... తప్పకుండా వుండే వుంటుంది. అయితే చెప్పదు. చెపితే ఈ సమాజం చీరేస్తుంది... అదెప్పుడూ ముళ్ళకర్ర పట్టుకుని సిద్ధంగా వుంటుంది... నిజంగా తపవిచేసిన వాళ్ళని దండించడానికి దానికి ధైర్యంచాలదు. అమ్మలాంటి అమాయకులెవరయినా తప్పుచేస్తున్నారేమోనని దుర్భిణీ వేసి వెతుకుతుంటుంది. "షిట్ గోటు హెల్...బ్లడీ సొసైటీ" ఈ మాట పైకి అన్నట్లున్నానేమో

"చిన్నా... ఏమిట్రా ఇది?" ఈసారి అమ్మ గొంతులో కాసింత చిరాకు. ఈ వయసులో కూడా అమ్మ చాలా అందంగా వుంటుంది. అమ్మ నా సొంతమ్మ(?) కాదు... నన్ను కన్నతల్లి నా తండ్రి అర్థాంతరంగా మరణించాక గుండెల్లోని కోరిక ముక్కని ఎగరేసుకుంటూ ఈ విశాల ప్రపంచంలోకి స్వేచ్ఛగా ఎగిరిపోయింది. అమ్మ మాట వచ్చినప్పుడల్లా నా కుటుంబసభ్యులు నానా మాటలూ అంటుంటారు. నాకు మాత్రం అమ్మ మంచి పనే చేసిందన్పిస్తుంది.

మనసులోని ఆలోచనలని, కోరికలని సంస్కారం పేరుతో అణగదొక్కి అణిచి పెట్టి కుమలడం కన్నా, ఈ సంస్కారయుత ప్రపంచాన్ని ఎడంకాలితో ఒక్క తన్నుదన్ని తన జీవితాన్ని తాను వెదుక్కోవడమే మంచిది... ' అమ్మా హేట్సాఫ్ టూ యూ.'

నన్ను వదిలి వెళ్ళడం తప్పా? కాదా? అన్నది కూడ అసంగతమే.

ఈ ప్రేమలూ, ఆత్మీయతలూ, బంధాలూ వ్యక్తిగత సుఖాన్నివ్వవు.

స్టాప్... స్టాప్... స్టాప్.

ఈ ప్రేమే లేకపోతే, పేగు కదలికన్నది వట్టిదే అయితే ఈ అమ్మ నా కన్నతల్లికి తోడబుట్టిన పాపానికి నన్ను, నా బాధ్యతల్ని నెత్తినేసుకుంటుందా? కడుపులో పెట్టుకు దాచుకుంటుందా?... 'అమ్మ' అనే పదబంధం నిజంగానే యింత గొప్పదా? ప్చ్...

"చిన్నా... చిన్నా..."

"చెప్పమ్మా" ఉలిక్కిపడి అమ్మకేసి చూశాను.

"చిన్నా... ఎంత కాదనుకున్నా నీ మేనమామ... వాడి అల్లుడికి రారాని కష్ట మొచ్చింది... ఇంత చిన్న వయసులో పక్షవాతమొచ్చి వాడు మంచం పట్టడం చూస్తుంటే శత్రువులకయినా కడుపు తరుక్కుపోతుంది."

"అయితే ఏమిటమ్మా? మంత్రమేదయినా వేయమంటావా? మంత్ర దండాల కోసం ఎక్కడికెళ్దాం..." నవ్వుతూనే నిర్లక్ష్యాన్ని కనపర్చాను.

"నాన్నా ఎందుకిట్లా తయారయ్యావు నువ్వు... మేనమామ కన్నతండ్రితో సమానం"

హుఁ మేనమామ... నాతల్లి వెళ్ళిపోయినపుడు ఏడుస్తూ వెళ్ళి వాడి కాళ్ళు పట్టు కుంటే ఒక్క విదిలింపు విదిల్చాడు.

అట్టాటి కొవ్వు బట్టిందీ యింట్లో తప్పబుట్టిందన్నాడు.

దాని కొడుకుని తన దగ్గరుంచుకుంటే ఈ సమాజం నవ్విపోతుందన్నాడు. తినీ... తినకా తను పెరిగి పెద్దవాడయ్యాడు. అంత అనామికంగా పెరిగినా చదువులతల్లి ఎట్లా వంటబట్టిందో అర్థంకాదు... అయినా సరే, 'గాలికి తిరిగే ఎదవకి నా కూతుర్నివ్వను మీకెంత ధైర్యం వాడికి పిల్లనివ్వమని అడగటానికి,' అంటూ వెళ్ళిన పెద్దమ్మల్ని అవ మానించి పంపాడు. ఆ పట్టుదలతోనే ప్రభుత్వోద్యోగం సంపాదించుకున్నాను. ఉద్యోగం సద్యోగం నేనెన్ని గంటల కెళ్ళినా అడిగే వాడుండడు. అడగడానికి ధైర్యం చాలదు. నా కళ్ళల్లోనే ఆ అదుపు. ఈ సమాజమేర్పరిచిన అదుపుల్ని అదుపుచేసే తన కళ్ళు... ఎరుపు జీరలు.

వచ్చిన జీతంలో సగం మా ఆఫీసు ప్రక్కనే వున్న లేబర్‌కాలనీలో వాళ్ళకోసం ఖర్చు పెడ్తాను. ఆఫీసులోని చిన్న వర్కర్స్‌కి అప్పులిచ్చి మర్చిపోతుంటాను.

"లోకాన్నుద్ధరించే వాడు పెళ్ళాన్నేం చాకుతాడు?" అంటూ ఎద్దేవా. హు మేన మామ... కన్నతండ్రి... కన్నతండ్రి వాడే వున్నట్టయితే తననిలా అనామకుడనేవారా జనం?

అనామకుడు.... నామకుడు... మకుడు... కుడు... డు...

డు..డు..డూ...డూ...బసవన్నా, మూతికి చిక్కం కట్టిన ఆవుదూడలాగా అమ్మ వెంట నడిచాన్నేను, లెవిస్ జీన్స్ ఫ్యాంటు మీదికి డెనిమ్ షర్టు టకప్ చేసి మామయ్య గాడి వద్ద స్టైయిల్ కొట్టడానికి... ప్చ్... మేము వెళ్ళేటప్పటికి వాడు లేడు... వరండాలో కూర్చుని అత్త మల్లెమాల కడ్తోంది.... ఆ సువాసన గేటు దాకా విస్తరించి మాకు స్వాగతం పలుకుతోంది.

"ఏవయ్యా ఎప్పుడొచ్చావు? రా...రా..." నోటి నిండా ఆహ్వానించింది అత్త... అత్త ఎప్పుడూ అంతే. లోలోపల సముద్రాలు పోటెత్తుతున్నా పైకి మాత్రం ఏమీ బయట పడకుండా ఆప్యాయత ఒలకబోస్తుంది.

"రా వదినా... కూర్చో... రొట్టెల పండక్కదా సాయంత్రం నెల్లూరుకి పోదామంటేనా మీయన్న... పూలు కడ్తుండా..." కూర్చున్న చోటునే వెనక్కి జరుగుతూ అత్త అమ్మని ఆహ్వానించింది.

"ఎట్టుండాదొదినా అల్లుడికి... యాడా దినుమ్మూ రావాలరావాలని ప్రయాణం... ఇట్టనే సరిపోతా వుండాదనుకో... ఇదిగో ఈ పొద్దబ్బయ్యొస్తే నాతోడు తీసుకుని వస్తా వుండా" అమ్మ కూడ నటనలో అత్తకేమీ తీసిపోదు.

"అల్లుడిదే గదమ్మా దిగులు. యింకేముండాది మాకు. ఆరోగ్యం రొట్టి అడిగి రానుపోతుండా, నెల్లూరుకి... చూద్దాం ఆ అల్లా అయినా మంచి చూపు చూస్తాడేమో..." అల్లాని స్మరిస్తూ చెప్పింది అత్త. మాల కడుతూనే ముక్కు ఎగబీలుస్తోందామె.

నెల్లూరులో రొట్టెల పండుగ చాలా సత్యమైంది... ప్రశస్తమైంది.

అక్కడ ఆరోగ్యం రొట్టి, సంపద రొట్టె, పెళ్ళి రొట్టె, సంతానం రొట్టె యిలా విడి విడిగా ఏది అవసరమయి మనం వెళ్తామో ఆ రొట్టెలు పట్టాలి. మన కోరిక తీరిన వెంటనే ఆపై సంవత్సరం అవసరమైన వాళ్ళు అది మన వద్ద నుండి తీసుకుంటారు. ఏ రొట్టె తింటే ఆ కోరిక నెరవేరుతుందని యిక్కడి జనాల్లో గొప్ప నమ్మిక.అందుకే మతాతీతమయిన జనసందోహం కన్పిస్తుందక్కడ. ఆరోగ్యం రొట్టె కెళ్తుందట అత్త. ఆరోగ్యం రొట్టెకి... మంచిదే.. ముందు నీ మొగుడికి బుద్ధి రొట్టి తెచ్చుకో అత్తా... నాలో నేనే గొణుక్కుంటూ లోపలికి అడుగు పెట్టాను.

మామ కూతురు జాహ్నవి మంచం పట్టిన వాళ్ళాయనకి ఒళ్ళు తుడుస్తోంది తడిగుడ్డతో... అలా వొంగి తుడవడంలో ఆమె ఎడమపార్శ్వమంతా 'పైట' తొలిగి చమక్ మని మెరుస్తోంది. పలకరిస్తే దృశ్యం మారుతుందేమోనని మౌనంగా చూస్తున్నాను.

ఇంతలో జాహ్నవి భర్త నన్ను చూసి 'మీబావ' అంటూ సైగ చేశాడు. అతడికి మాట కూడా పడిపోయినట్లుంది. కాలూ, చేయీ అస్సలు పైకి లేవడం లేదు. దుర్మార్గుడు మా మావ నన్ను చిన్నచూపు చూసినందుకు తగిన శాస్తే జరిగింది. ఇప్పడీ అల్లుడితో పడరాని పాట్లు పడుతున్నాడు. తేరాని చోట్లంతా డబ్బు తెస్తున్నాడు, దేవుళ్ళనీ, దయ్యాలనీ కూడ కొలుస్తున్నాడు.

"రా బావ..ఎప్పుడొచ్చావు?... ఇన్నాళ్ళకు గుర్తొచ్చామా?" జాహ్నవి నిష్టురపడుతూ నాకు ఎదురొచ్చి తీసికెళ్ళి కుర్చీలో కూర్చోబెట్టి తిరిగి తన పని తాను కొనసాగిస్తూ మధ్యమధ్యలో నాకేసి చూసి కళ్ళనీళ్ళు పెట్టుకుంటోంది.

"చూడు బావా, ఈయన పరిస్థితి ఎట్లా అయిందో?" అంటూ ఈ జబ్బు మొదల యిన్నాటి నుండీ, మొన్న చూపించిన చివరి డాక్టరు వరకూ అన్ని వివరాలూ పూసగుచ్చి నట్లు చెప్పసాగింది. నేను వింటున్నట్లు నటిస్తూ జాహ్నవినీ, వాళ్ళాయన్నీ నిశితంగా గమనిస్తున్నాను.

తుడవడం పూర్తిచేసి, పొడరద్ది చొక్కా మార్చి పడుకోబెట్టింది వాళ్ళాయన్ని... అతను అలసటగా కళ్ళు మూసుకున్నాడు. జాహ్నవి వాకిట్లో కెళ్ళి అమ్మని పలకరించి, మా యిద్దరికీ కాఫీ తీసుకురావడానికన్నట్లుగా వంట గదికేసి నడిచింది.

కాసేపు అక్కడున్న పాత పుస్తకాన్ని తిరగేసి, మళ్ళీ అతడికేసి చూశాను. మెల్లిగా నిశ్వసిస్తూ నిద్ర పోతున్నాడతడు. భారంగా వున్న అతడి వూపిరి చిత్రమైన శబ్దాన్ని చేస్తూ బయటికొస్తోంది.

పుస్తకాన్ని పక్కన పడేసి వంటగది కేసి నడిచాను నెమ్మదిగా.

జాహ్నవి అటు తిరిగి కాఫీ కలుపుతోంది.

ముదురు నీలంరంగు జాకెట్టూ, అదే రంగు పువ్వులున్న తెల్లచీరా ఆమె నడుము వద్ద ఎడబాటయి పచ్చటి ఆమె శరీరాన్ని మరింత మెరిపిస్తున్నాయి. తల వెంట్రుకలు చెమటతో తడిసి వీపుమీద చెల్లాచెదురుగా అతుక్కుపోయి వున్నాయి. నిర్లక్ష్యంగా వదిలేసినా ఏమాత్రం లావు తగ్గని జడ నీరసించిన ఆమె నడుముని దాటి పిరుదుల్ని తాకుతోంది.

కాఫీ కలుపుతున్న ఆమె కదలికలు చూస్తుంటే తట్టుకోవడం చాలా కష్టమయి పోయింది. వెనగ్గా వెళ్ళి జాహ్నవిని వాటేసుకున్నాను. ఉలిక్కిపడి పక్కకి తిరిగి నన్ను గుర్తించి, "బావా ఏంటిది వొదులు," అంది కోపంగా.

"జానీ..." గుసగుసగా పిలుస్తూ ఆమె మెడ వొంపుల్లో పెదాల్ని ఆన్చాను.

"బావా " ఆగ్రహంగా అరిచింది.

"ష్..ష్... జానీ...ఎట్లున్నావ్ ఆరునెలలుగా మీ ఆయన ముట్టుకోకుండా... అంద మంతా చూడు ఎట్లా విలవిల్లాడిపోతోందో" నా చేతులు జాహ్నవి ముందు బాగాల్తో మాట్లాడుతున్నాయి.

"ప్లీజ్ వూర్కో బావా... ఎవరయినా వస్తారు." అంది జాహ్నవి బతిమాలు తున్నట్లుగా. ఈసారి ఆ గొంతులో ఆగ్రహం లేదు.

నాలో ఉత్సాహమొచ్చేసింది.

'చచ్చింది గొర్రె... రెచ్చగొట్టి వొదిలిపెట్టాను. రిమ్మతెగులంటే సామాన్యమా? బ్రహ్మకయినా పుట్టాల్సిందే,' నాలో నేనే నవ్వుకుంటూ జాహ్నవిని మరింత గట్టిగా బంధించి వొదిలి, గుసగుసలాడి తిరిగి అమ్మ కేసి నడిచాను.

జాహ్నవి

'ఛ...ఛ...అదేంటి బావ అట్లా చేశాడు. వద్దని వారిస్తున్నా వినకుండా...' వంట చేస్తూ, పిల్లలకి అన్నం తినిపిస్తూ... యిల్లు సర్దుకుంటూ ఆలోచిస్తూనే వున్నాన్నేను.

'వొద్దని వారించిందా తను? ఉహూ... ఎవరయినా చూస్తారు అనేసింది. అంటే ఎవరూ చూడకపోతే ఫర్వాలేదనేగా.... నిజంగా ఫర్వాలేదా?'

ఆయన భోజనం పూర్తయింది. మజ్జిగ తాగుతానంటే కలిపి త్రాగించాను. ఇవ్వా ల్సిన మందులన్నీ కూడ జాగ్రత్తగా యిచ్చి తను నిద్రకొరిగాక దుప్పటి కప్పి యివతలి కొచ్చాను.

చీకటి కొంచెం కొంచెంగా చిక్కబడుతోంది.

బయటెక్కడో కోయిల కుహుకుహుమంటూ అనుకోని అతిథికి స్వాగతం పలుకుతోంది. ఆరు బయట నేన్నాటిన నైట్‌క్వీన్ మొక్క మల్లె మొగ్గలతో కలిసి చిత్రమైన సువాసనని లోపలికి మోసుకొస్తోంది.

సాయంకాలం బావ స్పర్శ తాలూకూ ప్రకంపనలు యింకా నా శరీరాన్ని వీడిపోలేదు. ఈ గాలి వాసనలో ఏదో కొత్తదనం.

ఇది నేను రోజూ చూస్తోన్న ప్రపంచంలా లేదు.

ఇది నేను చిన్నప్పట్నుండీ మోస్తోన్న దేహంలా లేదు.

ఏదో తపన... మరింకేదో ఉలికిపాటు.

అదేంటీ... పరాయి మొగాడు ముట్టుకున్నపుడు లాగి లెంపకాయ యివ్వాల్సింది పోయి నా శరీరం తెలీని సుఖానుభూతితో ఎందుకలా స్పందించింది?... గతంలో నా భర్త స్పర్శ నాలో ఎన్నడూ యిటువంటి ప్రకంపనలని రేపినట్లు గుర్తు లేదు. మగాడు ముట్టుకుంటే యిలా వుంటుందా? సుఖమంటే యిదేనా?... నా జీవితం కాని మరో జీవితమేదో వున్నట్లుగా వుంది. అదేదో తెలుసుకోవాలని తపనగా వుంది.

అసలు బావని నేను ప్రేమించానా?... యింకా ప్రేమిస్తున్నానా? లేదు... లేదు... అప్పుడెప్పుడో జీవితమంటే ఏమిటో తెలీనపుడు పదహారేళ్ళ వయసులో ఆ తెలుపూ, ఒడ్డూ, సొగసూ, మాట్లాడే తీరు చూసి ప్రేమించానని అనుకున్నాను... ఓర చూపులూ, ముసిముసి నవ్వులే ప్రేమని భ్రమించాను.

'ఆ లేచిపోయిన దాని కొడుక్కి నా కూతుర్నివ్వను,' అంటూ నాన్న స్టేట్‌మెంటివ్వడంతో ప్రేమని (?) గుండెల్లోనే సమాధి చేసుకున్నాను.

అయితే వివాహమనేది రెండు కుటుంబాల నడుమా, ఒక మగా, ఆడ మధ్యా మాత్రమే జరిగేది కాదు. దాంపత్యమంటే మనసుకీ, శరీరానికి కూడ సరయిన జోడి కావాలని యిప్పుడే అర్థమయింది. నాకు నిజంగా సరయిన జోడీ బావే.

పెళ్ళయి నాలుగేళ్ళు కాపురం చేసి, యిద్దరు పిల్లల్ని కూడ కన్న తరువాత తనిలా ఆలోచించడం సరయిందేనా? ఇంకింతే ఈ జీవితానికి యిలా జరిగిపోవాల్సిందే... కడుపులో నుండి ఏదో తెలీని వేదన తన్నుకొచ్చింది.

'ప్చ్ ..బావా నువ్వసలెందుకొచ్చావు?... ఎవర్రమ్మన్నారు?... మా ఆయన్ని నువ్వొచ్చి విచారించలేదని యిక్కడెవరయినా కొట్టారా? ఎందుకొచ్చావ్ బావా?... వొస్తే వొచ్చావు... ఎందుకు ముట్టుకున్నావు నన్ను? ముట్టుకుంటే మాత్రం, నాకేమయింది? ఈ రాత్రి దీర్ఘమై, సుదీర్ఘమై నన్నెందుకిలా కాలుస్తోంది?... నన్నిలా వేధించే హక్కు నీకెవరిచ్చారు?'

ఆలోచనల్లోనే స్నానం చేసొచ్చాను. తెలీకుండానే(?) తెల్లచీర కట్టుకున్నాను. చాలారోజుల తరువాత మల్లెలమాల జడలో తురుముకున్నాను. ముందు గదంతా అడ్డాల్లేకుండా శుభ్రంగా సర్దాను. అంటే... అంటే... బావ యిప్పుడొస్తాడనే నేను ఎదురు చూస్తున్నానా?

వస్తాడు... తప్పకుండా వస్తాడు.

అమ్మా, నాన్న అల్లుడికి ఆరోగ్యం రొట్టె పట్టడం కోసం రొట్టెల పండుక్కి నెల్లూరికి వెళ్లారని తెలుసు. అందుకే తలుపు తీసి వుంచమని గట్టిగా చెప్పాడు. వస్తాడు. తప్పకుండా వస్తాడు.

నాచుట్టూ ఆవరించి వున్న ఈ రాత్రి ఏ కదలికా లేని గాఢమైన నిశ్శబ్దంలో మునిగిపోయి వుంది. బావ నా నడుం చుట్టూ చేతులు వేసినప్పటి ఆ అనుభూతి చాలా వింతయినది. సుదూర ఆనంద సౌరభాలతో నా శరీరం తపించింది. ఆ అనుభూతి యిప్పుడు నేను నడుస్తున్న జీవితం కంటే దూరంగా వుంది. నేను మోస్తోన్న ఈ బాధ్యతల కంటే లోతుగా వుంది. నా గుండె లయ తప్పినట్లుగా వుంది . అందులో నుండి వెచ్చని ఆవిర్లొస్తున్నాయి. బుగ్గలు మెరుస్తున్నాయి. సంతోషంతో ఈ ఆనందపు వెల్లువని లోలోపలే నింపుకోవడం కష్టంగా వుంది. మరుక్షణంలో ఏదో భయం, దిగులు.

తప్పు చేయడం లేదు కదా... తప్పంటే ఏమిటి?

ఒక జీవన విధాన పద్ధతి ప్రకారం మనం నడుచుకుంటున్నాం. దానికి భిన్నంగా మరోలా వుండాలని అనుకున్నప్పుడు అది పద్ధతవుతుందా? అదేనా తప్పంటే?... ఇష్టాల్నీ, కోరికలనీ, అభిప్రాయాలనీ యిలా మనసులో దాచుకుని మదన పడుతుంటే మాత్రం అది పద్ధతవుతుందా? ఇదేనా సాంఘిక విలువంటే? ఛ...ఛ... స్ఫటికంలా స్వచ్ఛంగా హాయిగా ఆయనకి సేవ చేసుకుంటూ యింటా, బయటా జాహ్నవిలాంటి పిల్ల లేదన్పించుకుని యిప్పుడేవిటిలా?... ఛీ...ఛీ... బావ ఎందుకొచ్చాడో ఈ రోజు... అనుకుంటూనే వరండాలో కెళ్లి కిటికీ కర్టను తొలగించి, చుట్టూ పరుచుకున్న చీకట్లోనే రోడ్డు చివరికంటా సారించి చూశాను.

వీధి మలుపువద్ద ఎదురయిన శూన్యంతో ఉన్నట్టుండి నా హృదయం ఘనీభవించిన కన్నీటి చుక్కయింది. ఛ యిదేంటీ నేను ఏడుస్తున్నానా? ఎందుకూ? ఏదో కావాలి... మనసునీ, శరీరాన్ని కూడ ఏక కాలంలో సుఖపెట్టగలిగే అద్భుతమేదో జరగాలి.

చంద్రుడు కాంతి మబ్బులచాటు నుండి కొంచెంగా పడి చీకటిని కాస్త తగ్గించింది. చిన్న చప్పుడు దూరాన విన్పించినా, ఎక్కడ ఏది కదిలినా ఉలిక్కిపడుతూ కూర్చున్నాను.

ఒకవేళ బావ వొస్తే మాత్రం నేను అంగీకరిస్తానా? నాలో ఏదో అసహనం ప్రారంభమైంది. జీవితంలో అతి ముఖ్యమైన నిర్ణయమేదో తీసుకోవాల్సిన తరుణం ఆసన్నమయినట్లుగా నా అంతారాత్మ పదేపదే నా వీపు తట్టి హెచ్చరిస్తోంది. దాని నోరు నొక్కి మాటిమాటికీ బావ కోసం కిటికీలో నుండి చూస్తున్నాన్నేను. ఒక్కో నిమిషం గడుస్తోన్నకొద్దీ నా ఆశ తరిగిపోతోంది. మరుక్షణంలో మళ్ళీ ఆశ పెరిగిపోతోంది. ఏదో అశాంతి నిలువనివ్వడంలేదు. తలుపు వెనుక ఎవరో నిలుచుకుని ఏ క్షణంలో నైనా దానిని తెరుస్తారన్నట్లు మాటిమాటికీ తలుపువంక చూస్తూనే ఉన్నాను. మధ్య మధ్యలో గదిలో నిద్రపోతున్న

నా భర్తా, పిల్లలు కదుల్తున్నారేమోనని గమనిస్తున్నాను. గాఢనిద్రలో ఉన్న ఆయనకేసి చూస్తుంటే జాలికల్గింది. వ్యాపారం, వ్యాపారం అంటూ లేనిపోని టెన్షన్లు పెట్టుకుని ఒంటి మీదికి తెచ్చుకున్నారు.

బాగున్నపుడు మాత్రం?... ఏ రాత్రి 12కంటే ముందు ఇంటికొచ్చి ఎరుగడు. వచ్చినా భోజనమెంత హడావిడో నిద్ర, మైథునాలు కూడా అంతే... అదీ ఈ మధ్య... ఈమధ్య బాగా తగ్గిపోయింది. అసలదో పెద్ద విషయం అని కూడా తను ఆలోచించనే లేదు. ఇక ఇప్పుడైతే పూర్తిగా మంచం సేవ.

బావ ఏమన్నాడు?... 'అదే నువ్వే ఇలా మంచం పట్టుంటే మీ ఆయన నెలల తరబడి పస్తులుంటాడా?'... అని కదూ. ప్చ్ ఏమిటో ఈ సంసారాలు... పెద్దోళ్ళు పెళ్ళి చేశారు... తాడేదో కట్టి తాళి అన్నారు. కోరికల్నే ప్రేమనుకుంటూ అనుభూతులున్నా లేకపోయినా శరీరాన్ని కలుపుకుంటూ ఇలా ఒకే కప్పు కింద సాగిపోతూ ఉంటాయి. అలా సాగిపోతేనే సాంఘిక విలువలతో ఉన్నట్టు.

టైంఎంతయిందో తెలీదు కాని ఎక్కడో తీతువుపిట్ట ఒకటి వికారంగా అరిచింది. నా గుండె క్షణంపాటు ఒణికి సర్దుకుంది. మళ్ళీ నా కళ్ళని కిటికీలో నుండి బయటికి విసిరేశాను. చీకటదారి చివరి కంటా వెక్కిరించింది. ఏదోతెలీని భయంతో, అమూల్యమైన దాన్నేదో పోగొట్టుకున్నానన్న భావనతో మనసు పరితపిస్తోంది.

నిట్టూరుస్తూ వచ్చి సోఫాలో వెనక్కి వాలి పుస్తకాన్ని చూడసాగాను.

పక్కింట్లో పాలవాడి కేకకి చప్పున మెలకువ వచ్చింది. భయం భయంగా పడగ్గది కేసి చూశాను. ఆయనింకా నిద్ర లేచినట్లు లేదు. పాప మెల్లిగా కదుల్తోంది.

విచ్చుకుంటోన్న చిరు చీకట్ల ఆకాశం అందమైన ప్రశాంతమైన దృశ్యాన్ని ఒక ముక్కలా కిటికీలో నుండి లోపలికి విసురుతోంది. వేగంగా కొట్టుకుంటోన్న నాగుండెను అదిమిపట్టి కళ్ళు మూసుకుని గడిచిన రాత్రిని ప్రత్యక్ష్యం చేసుకునే ప్రయత్నం చేశాను. ఊహూ ఏమీ కనపడడంలేదు. నేను గుర్తు తెచ్చుకోలేనిదేదో జరిగపోయిందా? లేక అసలేమీ జరగలేదా? ఎంత ప్రయత్నంచినా బావ ముఖం గుర్తుకు రానంతగా కళ్ళ ముందు కరిగిన బొగ్గులాంటి చీకటి... మెల్లిగా కళ్ళు తెరచి, ఒక్క క్షణం తర్వాత వాస్తవం లోకి వచ్చి తరిచి చూసుకుంటే బావ రాలేదన్న నిజం ఆనందాన్నిచ్చింది.

'థ్యాంక్యూ బావా," అనుకుంటూ పైకి లేచాను.

తప్పు చేయలేదన్న ఒక నిర్భయబావం వెచ్చగా నన్ను కమ్ముకుంది.

ఏది తప్పు?... ఏది కాదు?...

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*19 నవంబర్ 2000*